**Eenadu**

# ఆన్‌లైన్ లోనే వృత్తివిద్య ప్రవేశ పరీక్షలు

- సన్నద్ధత కోసం ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- ఉన్నత స్థాయి సమీక్షలో నిర్ణయం

ఈనాడు – హైదరాబాద్



**2017–18** విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్య ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రాన్ని డిజిటలైజేషన్ చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పాన్ని అనుసరించి విద్యాశాఖలో కాగిత రహిత పాలనను తీసుకురావాలని అనుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో 9,10 తరగతుల పరీక్షలు కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. ఏపీ (మిగతా 2లో)

# ఆన్‌లైన్‌లోనే వృత్తి విద్య ప్రవేశ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో ప్రతి ఏటా ఇంజినీరింగ్, పీజీ ఈసెట్, ఈసెట్, ఐసెట్, లాసెట్, పీజీ లాసెట్, ఎడ్‌సెట్ పరీక్షలు జరుగుతున్నాయి. 2016-17లో డీఎడ్, భాషా పండితుల కోర్సుల ప్రవేశాలకు, మండల విద్యా సమన్వయకర్తల నియామకాల కోసం ఆన్‌లైన్‌లోనే విజయవంతంగా పరీక్షలు నిర్వహించారు. అదే తరహాలో ఇతర ప్రవేశ పరీక్షలు కూడా జరపడంపై సమీక్ష సమావేశంలో చర్చించారు. జేఎన్‌టీయూ కాకినాడ ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ మాట్లాడుతూ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో వచ్చే ఏడాది వరకు పరీక్షల్ని జరిపితే బాగుంటుందని సూచించారు. రెండు పద్ధతుల్లో పరీక్షల్ని నిర్వహిస్తే వ్యయప్రయాసలు తప్ప ప్రయోజనం ఉండదని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సంధ్యారాణి మాట్లాడుతూ డీఎడ్, భాషా పండితుల కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు రాసిన వారంతా దాదాపుగా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారేనని పేర్కొంటూ నిర్వహణలో ఎదురైన ఇబ్బందులు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. విద్యార్థుల ఆధార్ సంఖ్యలను సేకరించడం ద్వారా అక్రమాలు అడ్డుకోవచ్చని పలువురు సూచించారు. ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణపై ఇప్పటి నుంచే అవగాహన కలిగించాలని, అందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు భారీగా వ్యయం కానున్న విషయమూ చర్చకు వచ్చింది. ఈ సమావేశంలో ఏపీ సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఉదయలక్ష్మి, ఏపీ ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.నరసింహారావు, కార్యదర్శి వరదరాజన్, తదితరులు పాల్గొన్నారు.

**15న ప్రతిభా పురస్కారాల ప్రదానం..** విజయవాడలో వచ్చేనెల 15వ తేదీన ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరగనుందని, అదేరోజు డిజిటల్ తరగతులు కూడా ప్రారంభమవుతాయని మంత్రి గంటా చెప్పారు. ఇందుకు ప్రవాస భారతీయులు రూ.70 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు వెచ్చిస్తున్నారని తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న బీఎడ్ కళాశాలల నిర్వహణపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఏమైనా చర్యల్ని తీసుకోబోతే యాజమాన్యాలు కోర్టును ఆశ్రయిస్తున్నాయని చెప్పారు. తనిఖీల నివేదికల ఆధారంగా ఇంజినీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కొత్త విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులకు రూ.150 కోట్లు మంజూరు చేశామని, యాన్యుటీ విధానం కింద రూ.5000 కోట్లతో పాఠశాలలకు కొత్త భవనాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలను జంబ్లింగ్ విధానంలో జరుపుతామని పునరుద్ఘాటించారు.